క్లుప్తంగా

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ



నాగాయలంక: మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రక్షణసైన్యం (సాల్వేషన్ ఆర్మీ)దివి ఉప మండలం నాగాయలంక కోర్ ఆధ్వర్యంలో బుధవారం మానవ అక్రమ రవాణా పరిస్థితులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఉప మండలం అధికారి మేజర్ టి.ప్రసాదరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు మేజర్ టి.డి.రత్నకుమారి మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా ప్రపంచ బిజినెస్‌గా మారడం ఆందోళన కలిగిస్తుందన్నారు. తొలుత గ్రామంలోని రాజేశ్వరి కాలనీ నుంచి ట్రాఫిక్ ఐలాండ్ కూడలి వరకు ప్రధాన మార్గం వెంట ప్లకార్డులతో ర్యాలీ చేశారు. సంస్థ యూత్ విభాగం జిల్లా అధికారి లెఫ్టినెంట్ డి.అనిల్, సిఓ డి.కోటేశ్వరమ్మ, బందెల నాగబాబు, జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె. కొత్తపాలెంలో 8వ నెంబర్ పంట కాలువ సమీపంలోని పంట బోదు పూడిక తీత పనులు బుధవారం చేపట్టారు. ఇటీవల కొంత మంది రైతులు పంటబోదు పూడుకపోయి సాగు నీరు రావడం లేదని గ్రామసర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్యను ఎంపీడీవో స్వర్ణభారతికి వివరించడంతో ఆమె ఆదేశాల మేరకు పంటబోదులో పూడికతీత పనులు పొక్లెయిన్ సాయంతో చేపట్టినట్లు తెలిపారు.


ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం(ఘంటసాల): కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం వద్ద కృష్ణానదిలో వరద ఉధృతిని తహసీల్దార్ విజయ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానదికి ఎగువ ప్రాంతంలో భారీగా వరద నీరు చేరడంతో శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామ ప్రజలు నది వైపు వెళ్లడం కాని, పశువులను, మేకలను మేపుట గాని, మేతకు వెళ్లడం కాని, వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు, మత్స్య కారులు చేపల వేటకు కృష్ణానదిలోకి వెళ్లొద్దని సూచించారు. శ్రీకాకుళం నదిలోని నుంచి వెళ్లే కృష్ణా - బాపట్ల జిల్లాల రాకపోకలు కూడా పూర్తిగా నిలిపివేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాస్, వీఆర్వో దగాని గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడదాం

చల్లపల్లి: పేదలపై మరింత ఆర్థిక భారాన్ని మోపే స్మార్ట్ మీటర్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా పిలుపునిచ్చారు. స్థానిక రైతు బజారులో బుధవారం సాయంత్రం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీన స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సబ్‌స్టేషన్ల వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్, ఇందన ఛార్జీల విధానాన్ని తొలగించాలని తెలిపారు.

ఎస్ఐ శ్రీనివాస్‌కు పురస్కారం



అవనిగడ్డ: విధుల్లో ప్రతిభ కనబర్చినందుకు గానూ ఎస్ఐ కె.శ్రీనివాస్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో బుధవారం ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాస్‌కు ప్రతిభ పురస్కారం అందించారు.

ఈ క్రాప్ తప్పనిసరి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): రైతులు తమ పంటకు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. హెప్సిబారాణి తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కోనేరుసెంటర్: బందరు మండలం పోతేపల్లి, అరిశేపల్లి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.రామ్‌కుమార్ మాట్లాడారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): రైతులకు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు అన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఇన్‌చార్జి ఏవో రామమోహనరావు మాట్లాడారు.

ఆర్థిక సాయం అందజేత

గూడూరు: కప్పలదొడ్డిలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మేడక వినోద రావు అంత్యక్రియలకు దేవాంగ యూత్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. వినోద రావు కుటుంబ పరిస్థితి తెలుసుకున్న దేవాంగ యూత్ అంత్యక్రియలకు రూ.10558 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ఊటుకూరి సుధీర్‌కుమార్, పింజల రవీంద్ర, వుట్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న యూరియా కొరత!

- ముమ్మరంగా సార్వా పనులు
- వెద పద్ధతే మేలంటున్న రైతులు
- నారుకు డిమాండ్

బంటుమిల్లి: మండలంలో సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్న క్రమంలో కొద్ది రోజుల్లో నాట్లు సైతం పూర్తి కానున్నాయి. ఈ సంవత్సరం ఆది నుంచి రైతులు నీటి ఎద్దడిని ఎదుర్కొంటే ప్రస్తుతం యూరియా కొరత వేధిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారుల సమాచారం మేరకు... మండలంలో దాదాపు 14 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. అందులో సుమారు 12 వేల ఎకరాల్లో వెద పద్ధతిని అనుసరిస్తారు. మిగిలిన రెండు వేల ఎకరాల్లో నారు మళ్లు పోసుకుని నాట్లు పనులు ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు కాలువలకు పూర్తి స్థాయిలో నీరు సరఫరా అవుతుండటంతో వ్యవసాయ పనులు వేగం పుంజుకున్నాయి. వ్యవసాయ ఖర్చులు తగ్గడం, దాదాపు నెల రోజులు సాగు సమయం తగ్గుతుందని భావించిన రైతులు కొన్ని సంవత్సరాలుగా ఈ పద్ధతిలోనే వ్యవసాయం చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో రోహిణిని తలపించిన ఎండలకు నీటి ఎద్దడి రావడంతో వెద చల్లిన భూములు నెర్రెలిచ్చి వరి పంట మొక్క దశలోనే ఎర్రబడి ఎండిపోయింది.

వరి నారుకు మంచి డిమాండ్...

ఈ సంవత్సరం సార్వా సాగు నీటి ఎద్దడిని ఎదుర్కొన్న క్రమంలో వరి నారుకు మంచి డిమాండ్ వచ్చింది. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని పలు బ్రాంచి కాలువలపై ఆధారపడ్డ భూముల్లో రైతులు అత్యధికంగా వెద పద్ధతిని సాగు చేపట్టారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం ఆదిలోనే నీటి ఎద్దడి రావడంతో వెద పొలాలు ఎండలకు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాల్లో మరల రెండోసారి నీరుపెట్టి దమ్ములు చేసి నాట్లు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గత వారం, పది రోజుల్లో దాదాపు 14 సెంమీ వర్షం కురవడంతోపాటు కాలువలకు సాగునీరు పూర్తి స్థాయిలో శివారుకు చేరుతున్నది. దీంతో నారు కోసం రైతులు గ్రామాల బాట పట్టారు. ఎక్కడ నారు దొరికితే అక్కడ సెంటు రూ. 600 నుంచి 800 వరకు కొని తరలిస్తున్నారు. ఇంక కొద్ది రోజులు పోతే సెంటు వెయ్యి రూపాయలు అయిన ఆశ్చర్యంలేదని పలువురు రైతులు వాపోయారు.

రైతును వెన్నాడుతున్న యూరియ కొరత...

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండగా రైతులను యూరియా కొరత వెన్నాడుతోంది. ఈ సంవత్సరం సార్వాసాగు ఆది నుంచి ఒడిదుడుకులను ఎదుర్కొంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నది. జూన్ నెలలో కురిసిన భారీ వర్షాలకు హడావుడిగా వెద చల్లిన రైతులు జూలై మొదటి వారంలో నీటి కష్టాలను ఎదుర్కొని వేలాది రూపాయలు ఖర్చుపెట్టి ఆయిల్ ఇంజిన్లతో పంట కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి ఎద్దడి నుంచి గట్టెక్కితే మరలా రెండోసారి యూరియా రూపంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో యూరియా అందుబాటులో లేదు. ఉన్నచోట తెలిసిన రైతులకు రూ. 320 నుంచి 350 వరకు వ్యాపారులు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రైతులు కూడా తమ ఇబ్బంది తీరిపోయిందని భావించి ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడంలేదని సమాచారం.



కొర్లపాడు గ్రామ పరిధిలో వెద పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు



నారు తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్న పెదపట్నం ప్రాంతానికి చెందిన రైతులు

ఆర్ఎస్‌కేలను వినియోగంలోకి తేవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. పేరు మార్చిందిగానీ వాటిని రైతులకు అందుబాటులోకి తేవడంలో విఫలమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పాలనలో ఎరువులు, సేవలు ఆర్బీకేల ద్వారా రైతు ముంగిటకు తీసుకువెళితే కూటమి పాలనలో రైతులు ఎరువుల కోసం పడిగాపులు పడుతున్నారు. అదనపు బాధ్యతల వల్ల మండలంలో అధికారులే అందుబాటులో ఉండటం లేదు. ముమ్మరంగా సాగుతున్న వ్యవసాయ పనులకు సంబంధించి రైతులు తమ ఇబ్బందులు ఎవరితో చెప్పుకోవాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారులను నియమించాలి ఆర్ఎస్‌కేల ద్వారా ఎరువులు అందుబాటులోకి తేవాలి. అవసరమైతే రైతుల క్షేమం కోసం ఆందోళన బాటపడతాం.

–తిరుమాని శ్రీనివాసరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం జిల్లా కన్వీనరు

సొసైటీలు సందర్శించిన కిట్టు

కోనేరుసెంటర్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో ఎరువులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఆయన పోతేపల్లి, అరిశేపల్లి, సీతారామపురం, గోకవరం, చిలకలపూడి పీఏసీఎస్‌లను సందర్శించారు. ఆయా సొసైటీల్లో రైతులకు అవసరమైన ఎరువులు ఏ మేరకు అందుబాటులో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. సొసైటీ గోదాములు తెరచి చూశారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవటంతో అవాక్కయ్యారు. పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడి ఎరువుల విషయంలో ఉన్న సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది రైతులకు సంబంధించి ఎరువులు ఇంకా సొసైటీలకు చేరలేదని సిబ్బంది చెప్పటంతో ఆశ్చర్యానికి గురయ్యారు. అసలు సొసైటీలకు ఎరువులు వచ్చాయా లేదా అని అడగటంతో సిబ్బంది మౌనంగా ఉండిపోయారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ రైతులకే న్యాయం చేయలేని ప్రభుత్వం ఇంకా ప్రజలకు ఏ విషయంలో న్యాయం చేస్తుందని ప్రశ్నించారు. గత్యంతరం లేని పరిస్థితిలో రైతులు ఎరువుల కోసం దళారులను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సొసైటీల్లో ఎరువుల బస్తాలు గుట్టలు గుట్టలుగా ఉన్నాయంటూ టీడీపీ నేతలు ఊదర కొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటువంటి దగా కోరు ప్రభుత్వాన్ని నమ్మి రైతులు నట్టేట మునిగిపోయామంటూ విలపించే పరిస్థితి దాపురించటం నిజంగా సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నార్త్‌మండల అధ్యక్షుడు మట్టా మోహననాంచారయ్య, ప్రధాన కార్యదర్శి మూర్తిరెడ్డి, కార్యదర్శి గోపు మురళీ, ఉపాధ్యక్షులు మందా బాబురావు, నట్టే ప్రసాద్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పిప్పళ్ళ నాగబాబు, రైతు విభాగం అధ్యక్షుడు గడిదేశి రాజు, జిల్లా పార్టీ సంయుక్త కార్యదర్శి గణేశన రమేష్, ప్రచార కమిటీ అధ్యక్షుడు పరింకాయల అశోక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గోకవరం పీఏసీఎస్‌లో ఎరువుల సమాచారం తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

లాడ్జిలకు రెసిడెన్సీ ఆస్తి పన్ను వేయడం ఏంటీ?

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిలదీత



సమావేశంలో నాగకుమారి

పెడన: పన్నులు విషయంలో రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని, పట్టణంలో లాడ్జిలు నడుపుతున్న వారికి రెసిడెన్షియల్ పన్ను వేయడం ఏమిటని, హోటల్స్‌లో ఆహారం, నూనె కల్తీ జరుగుతున్నా తనిఖీలు ఏమయ్యాయని, నిబంధనలకు విరుద్ధంగా పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్నా చర్యలు ఏమయ్యాయంటూ కౌన్సిల్ సభ్యులు అధికారుల తీరుపై తీవ్రంగా మండి పడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని 16 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించగా 12, 15 అంశాలకు12వ వార్డు కౌన్సిలర్ డీసెంట్ ప్రకటించారు. పట్టణంలో ఆస్తి పన్నులు పెంచాలని ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పెడన వచ్చిన సమయంలో అధికారులకు దిశానిర్దేశం చేశారని, నిజమేనా అంటూ 17వ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపి అధికారులను ప్రశ్నించారు. నిజమేనని, ఆస్తి పన్ను తక్కువగా ఉన్న వాటిని గుర్తించి వాటికి నిబంధనల మేరకు ఎంత ఉందో అంత వేయాలని, అసలు వేయని వాటికి కూడా ఆస్తి పన్ను వేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ చంద్రశేఖరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలో రెండు లాడ్జిలున్నాయని, ఒక రూం అద్దె రూ.2వేలుకుపైగా వసూళ్లు చేస్తున్నారని, అటువంటి వాటికి ఆస్తి పన్ను వ్యాపార సంస్థలకు కాకుండా రెసిడెన్షియల్ పన్ను వేయడం ఎంత వరకు సబబు అంటూ గోపి అధికారులను ప్రశ్నించారు. తక్షణం తనిఖీలు చేసి సరిచేసి ఫెనాల్టీతో సహా వసూళ్లు చేస్తామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. పాత కూరగాయల మార్కెట్ రోడ్డు వేయలేకపోతున్నారని, ఆక్రమణలు తొలగించలేని దుస్థితిలో మున్సిపల్ అధికారులున్నారని ధ్వజమెత్తారు. తక్షణం ఆక్రమణలు తొలగించి రోడ్డు వేయాలని కోరారు.

నాణ్యత లేకుండా ఆహారపదార్థాలు...

9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు మాట్లాడుతూ పట్టణంలో చాలా హోటళ్ల నిర్వాహకులు కల్తీ నూనె వాడుతూ ఆహార పదార్థాలను నాణ్యత లేకుండా విక్రయిస్తున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. మున్సిపాలిటి అధికారులకు తనిఖీ చేసే అధికారం లేదా అన్ని ప్రశ్నించారు. కమిషనర్ చంద్రశేఖరెడ్డి సమాధానం ఇస్తూ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఉంది కానీ ఆ పోస్టు భర్తీ కాలేదన్నారు. కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు కూడా తనిఖీ చేసే అధికారం ఉందని, తప్పకుండా తనిఖీలు చేస్తామని కమిషనర్ జవాబిచ్చారు. పట్టణంలోని ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ విషయంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు, వైఎస్‌చైర్మన్లకు, కౌన్సిల్ సభ్యులకు ఎవరిని ఆహ్వానించకుండా కేవలం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చేతులు మీదుగా మెప్మా మిషన్ మేనేజర్ ఆనందబాబు పంపిణీ చేసేలా చేయడం పాలకవర్గాన్ని అవమానించడమేనని కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు అన్నారు. తక్షణం సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని సూచిస్తూ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు తెలియజేయాలని చైర్‌పర్సన్‌ను కోరారు. పట్టణంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఎవరూ అభ్యంతరం చెప్పరని, అభివృద్ధికి తొలిగా అడుగులు వేసింది వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులేనని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, టీపీవో సుజనకుమారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కౌన్సిల్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న చంద్రబాబు తదితరులు

స్వామిత్ర సర్వేకు 12 గ్రామాల ఎంపిక

గూడూరు: స్వామిత్ర సర్వే ఫేజ్-2లో భాగంగా ప్రభుత్వం గూడూరు మండలంలోని 12 గ్రామాలను ఎంపిక చేసినట్లు ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి తెలిపారు. స్వామిత్ర సర్వేకు సంబంధించి ఎంపికైన గ్రామాల బృందాలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, వీఆర్వో సభ్యులుగా ఉండే బృందం గ్రామంలో ప్రతి ఇంటికీ సర్వే నిర్వహించి భూ హక్కు పత్రాలు జారీ చేస్తామన్నారు. మండలంలోని ఆకుమర్రు, కలపటం, చిట్టిగూడూరు, గంద్రం, గురిజేపల్లి, జక్కంచర్ల, నారికేడాలపాలెం, రామన్నపేట, మద్దిపట్ల, తుమ్మలపాలెం, రామానుజ వత్తర్లపల్లి, లేళ్లగరువు గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రెండో విడత ఎంపికైన గ్రామమైన రామరాజుపాలెంలో స్వామితర సర్వేను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా ఉందన్నారు.. పీఏసీఎస్‌లకు వెళితే లేదన్నారు..

- యూరియా దొరక్క రైతుల ఇబ్బందులు
- ఏడీఏ కార్యాలయాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి
- రైతులకు యూరియా అందించకపోతే ఆందోళన చేస్తామని రమేష్‌బాబు హెచ్చరిక

అవనిగడ్డ: యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నారుమళ్ళకే యూరియా కొరత ఏర్పడితే నాట్లు పూర్తయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కొంత మంది పార్టీ నాయకులతో కలసి స్థానిక అగ్రి ల్యాబ్‌లోని ఏడీఏ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ జయప్రదను కలుసుకుని యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వివరాలు గురించి మాట్లాడారు. చాలాచోట్ల యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఎక్కడెక్కడ యూరియా అందుబాటులో ఉందని ప్రశ్నించారు. దీనికి ఏడీఏ స్పందిస్తూ యూరియా కొరత లేదని అన్ని పీఏసీఎస్‌ల్లో అందుబాటులో ఉందని చెప్పారు. కొంతమంది రైతులు అవనిగడ్డ పీఏసీఎస్‌కు వెళ్లగా యూరియా లేదని నాలుగు రోజుల తరువాత వస్తుందని సిబ్బంది సమాధానం చెప్పడం కొసమెరుపు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో 65 శాతం నాట్లు పూర్తవ్వగా, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో 20 శాతం నాట్లు మాత్రమే జరిగాయి. నాట్లు వేసిన వారం రోజుల లోపు రైతులు ఎకరాకు ఒక కట్ట యూరియా, ఒక కట్ట కాంప్లెక్సు ఎరువులు వేస్తారు. సగం నాట్లు పూర్తి కాకముందే యూరియా కొరత రావడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడీఏ జయప్రద అన్ని చోట్ల యూరియా ఉందని చెప్పగా, నాగాయలంక మండలంలో రెండు పీఏసీఎస్‌లు, కోడూరులో రెండు, మోపిదేవిలో రెండు, చల్లపల్లిలో ఒకటి, ఘంటసాలలో ఒక పీఏసిఎస్‌లలో మాత్రమే యూరియా ఉన్నట్లు రైతులు చెప్పారు. యూరియా కొరత ఉన్నా అధికారులతో కావాలనే అబద్ధాలు చెప్పిస్తున్నారని కొంతమంది రైతులు ఆరోపించారు.

నాగాయలంకలో షాపుల నిర్వాహకులు చేతులెత్తేసినా..:

నాగాయలంక ఫెర్టిలైజర్ షాపు నిర్వాహకులు యూరియా ఎమ్మార్పీ రేటుకు అమ్మలేమని గతంలోనే అధికారులకు చెప్పారు. ఈ నేపథ్యంలో నాగాయలంకలో ఎరువుల షాపుల్లో ఎక్కడా యూరియా అమ్మకాలు జరగడం లేదు. అయినా అధికారులు పీఏసీఎస్‌లలో యూరియా అందుబాటులో ఉంచే చర్యలు తీసుకోలేదు. నాగాయలంక పీఏసిఎస్‌లో ఎప్పుడో పాతవి ఒక వంద కట్టలు (బ్యాగులు) మాత్రమే నిల్వ ఉన్న యూరియా ఉంది. బర్రంకుల, పెదకమ్మవారిపాలెం పీఏసిఎస్‌లతో మాత్రమే కొద్దిగా యూరియా అందుబాటులో ఉంది.

యూరియా అందుబాటులో ఉంచక పోతే ఆందోళన: మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

యూరియా విషయంలో పాలకులు, అధికారులు వాస్తవాలు దాస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. యూరియా అన్నిచోట్ల ఉందని అధికారులతో ప్రజాప్రతినిధులు చెప్పిస్తున్నారని తెలిపారు. అవనిగడ్డలో అందుబాటులో ఉందని ఏడీఏ చెప్పగా అక్కడకు రైతులు వెళితే లేదని, నాలుగు రోజుల తరువాత వస్తుందని చెప్పారని సింహాద్రి వెల్లడించారు. ఘంటసాల మండలంలో ఘంటసాలలో నాగాయలంకలో రెండు చోట్ల మాత్రమే యూరియా ఉందన్నారు. పాలకులు స్పందించి అన్ని పీఏసీఎస్‌లలో యూరియా అందుబాటులో ఉంచాలని లేదంటే వైఎస్సార్ సీపీ తరుపున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ పంచాయితీరాజ్ విభాగం జిల్లా కన్వీనర్ సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల జయగోపాల్, మాజీ సర్పంచ్‌లు నలుకుర్తి రమేష్, సైకం బాబూరావుతో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



యూరియా కొరతపై ఏడీఏతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

కోనేరుసెంటర్: మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండి గ్రామీణ ప్రజలను చైతన్యపరచాలని రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ఒక వ్యవస్థీకృత నేరమన్నారు. దీనిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ దోపిడీని అంతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏదైనా సంఘటన జరిగాక స్పందించడం కంటే ముందుగానే దాని గురించి తెలుసుకొని జాగ్రత్త పడితే చాలా మంచిదని తెలిపారు. మానవ అవయవాలు కూడా అక్రమ రవాణా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో స్నేహాలు, ఫొటోలు, వీడియోలు పంచుకోవడంతోనే సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా తెలిసిన వారే నేరాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, తూర్పు గోదావరి, విశాఖపట్నం, పల్నాడు జిల్లాల్లో కొంత మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తుందని వివరించారు. మహిళా హెల్ప్ లైన్ నంబర్లు 181, 112 సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి కె.రాంజీ, అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, రిజిస్ట్రార్ ఉష, రెక్టారు బసవేశ్వరరావు, పోలీసు, ఐసీడీఎస్ అధికారులు, విశ్వ విద్యాలయం అధ్యాపకులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ తదితరులు

స్కూల్ బస్సు డ్రైవర్లకు మార్గదర్శకాలు

బంటుమిల్లి: ప్రైవేటు కాలేజీలు పాఠశాలల బస్సు డ్రైవర్లు ముగింపు, ప్రారంభ సమయాల్లో ట్రాఫిక్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ గణేష్ కుమార్ సూచించారు. స్టేషన్లో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డ్రైవర్లకు పలు విషయాలపై అవగాహన కలిగించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బంటుమిల్లిలోని పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మార్గదర్శకాలు చేశారు. ముఖ్యంగా సాయంత్రం పూట విద్యాసంస్థలన్నీ ఒకేసారి వదిలిపెట్టడంతో టాపిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. యాజమాన్యాలు, డ్రైవర్లు సమన్వయం చేసుకొని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కొమ్మారెడ్డి, సెయింట్ జాన్స్, వాగ్దేవి, సాయి సిద్ధార్థ విద్యాసంస్థల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై గణేష్‌కుమార్

సైబర్ నేరాల నివారణపై అవగాహన



చల్లపల్లి: సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో లోన్లు వంటి వాటిపై సీనియర్ సిటిజన్స్ అప్రమత్తంగా వ్యవహరించాలని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు హెచ్చరించారు. ఆర్యవైశ్య సంఘ భవనంలో బుధవారం సీనియర్ సిటీజన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎవరైనా రుణాలు ఇస్తామంటూ తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వాటికి స్పందించవద్దని సూచించారు. అలాగే ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లు, వాట్సాప్‌కు వచ్చే లింకులు ఓపెన్ చేయటంగానీ, వాటిని చదవటం గానీ చేయవద్దని స్పష్టం చేశారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశంలో చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్య, ట్రైనీ ఎస్ఐ కె.శ్రీలత, సీనియర్ సిటీజన్లు తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు అవకాశం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న అనధికారిక లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందని కమిషనర్ బాపిరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అనధికార లే అవుట్లు వేసిన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీకి ముందు వేసిన అనధికార లే అవుట్లను నిర్ణీత అపరాధ రుసుం, 14 శాతం ఓపెన్ స్పేస్ ఖరీదు చెల్లించి క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించారని చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుంచి 90 రోజుల లోగా పది శాతం అపరాధ రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దాఖలు చేయాలని సూచించారు. క్రమబద్ధీకరణ చేసుకోని లేఅవుట్లు వివరాలు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల రిజిస్టర్‌లో నమోదు చేస్తామని హెచ్చరించారు. వివరాలకు టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

నేటి మహావస్త్ర సమర్పణ వేడుక వాయిదా

నాగాయలంక: గ్రామంలో పవిత్ర కృష్ణానదికి గురువారం భక్తులు తలపెట్టిన మహా వస్త్ర సమర్పణ వేడుక వాయిదా వేసినట్లు శ్రీరామపాద క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్ బుధవారం తెలిపారు. కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా ఈ పరిస్థితుల్లో కార్యక్రమం నిర్వహణ సాధ్యం కాదని పేర్కొన్నారు.